# బాధ్యత

సిరిపురం,

తేదీ 1-2-1951

మిత్రుడు ధర్మారావుకి,

మనం పరస్పరం ఉత్తరాలు రాసుకొని ఒక పుష్కరంపైగా కాలం గడిచింది. మనం చదువుకొనే రోజుల్లో ఎవరైన జ్యోతిష్కుడు మనం ఇంత దగ్గరలో ఉండి ఒకరినొకరము చూసుకోకుండా, ఉత్తర ప్రత్యుత్తరాలు లేకుండా ఉంటామంటే నమ్మలేకపోయేవాళ్ళం. కాని, మనం ఎంత ఊహించనీ, నమ్మలేని సంగతులే అతి సామాన్యంగా జరిగిపోతూ ఉంటాయి లోకంలో!

అసలు ఈ ఉత్తరం రాయడానికి బదులు నేనే బయలుదేరి రావాలనుకొన్నాను. కాని, యిక్కడ ఇంటి పరిస్థితులు అనుకూలంగా లేవు. కాకపోయినా నేను అక్కడకు రావడంకంటే నువ్వు ఇక్కడకే రావడం చాలా బాగుంటుంది. మీ బాంకుకి ఆదివారం శెలవు ఉంటుంది కదా, మరొక రెండు మూడు రోజులు శెలవు పెట్టివస్తే చాలును నేను రాకుండా నిన్ను రమ్మనడము మర్యాద లక్షణంకాదని నాకు తెలుసును. అయినా మన స్నేహాన్ని పురస్కరించుకొని, ఇలా రాసినందుకు అన్యధా భావించవని నమ్ముతున్నాను.

ఒక ముఖ్యమయిన అంశంలో నీ సలహా నీ పలుకుబడీ, అత్యవసరంగా కావాలి. ఇందులో నీకు పెద్ద కష్టం ఏమీ ఉండబోదు. తప్పక రావలసిందని పదేపదే వ్రాయడం అనవసరం, అన్ని సంగతులూ ముఖస్థంగా మాట్లాడుకొందాము.

ఈ వచ్చే ఆదివారంనాడే వీలుంటె బయలుదేర గోర్తాను. బయలుదేరేముందు ఉత్తరంరాస్తే ఇక్కడ స్టేషనుకు నేను బండి పంపిస్తాను. వీలుంటే నేనే వస్తాను.

వచ్చేటప్పుడు కారామసాలా కొంచెం తీసుకొని రావలెను. ఈ ఆదివారంనాడే తప్పక బయలుదేరవలెను.

ఇంతే సంగతులు

కా॥ కృష్ణశర్మ.

ఫిబ్రవరి, మూడవ తేదీ 1951.

నిన్నరాత్రి వస్తుందేమో ననిపించిన జ్వరం మరి రాలేదు. ఉదయం లేచేసరికి మామూలుగానే ఉంది. భోజనంకూడా సరిగానే చెయ్యగలిగాను.

ఆఫీసులో ఏమీ విశేషాలు లేవు.

నరసింహం గత నెలలో పుచ్చుకొన్న పదిహేనులోనూ అయిదు బాకీ పెట్టి పది ఇచ్చేశాడు. అయినా నయమే. అడక్కుండా ఇచ్చేడు.

కామేశ్వర్రావు వెనకటి ముప్ఫైరెండు తీర్చకపోడం అటుండగా, మరొక ఇరవై యిమ్మని అడిగేడు. అంతా కలిపి మళ్ళీ నెలలో తీర్చేస్తానంటాడు. ఈ నెలలో లేని అవకాశం మళ్ళీ నెలలో ఎలావస్తుందో ఊహించుకోకూడదా ? అయినా గట్టిగా చెప్పలేకపోయేను. నా దగ్గర కూడా ఏమీలేదని. ఏవో అనుకోని ఖర్చులు వచ్చేయనీ చెప్పాను. ఈమారు గాని అడిగితే, ముందు లోగడ తీసుకొన్నది ఇమ్మని నిష్కర్షగా చెప్పాలి.

ఇవాళ ఉదయం ఒక చిత్రమయిన ఉత్తరం వచ్చింది కా. కృష్ణశర్మ ఇన్ని సంవత్సరాల తరువాత రాశాడు. అందులోనూ ఏదో ముఖ్యమయిన విషయంలో నా సలహా పలుకుబడీ కావాలట ! అంత, నా అవసరం ఉన్నవాడు ఆ విషయం ఏమిటో స్పష్టంగా రాయకూడదా ? అంత ఉత్తరంలో రాయకూడనిది ఏమయిఉంటుంది ? ఇదేదో అనవసరపు గొడవలాగుంది. తనకు రావడానికి కుదరదట: అంటే ఇవతలివాళ్ళకు మరేమీ పనీపాటూ లేదని కాబోలు. అసలు సంగతేమిటో స్పష్టంగా రాస్తే, అప్పుడు రావడం రాకపోడం మాట ఆలోచించవచ్చునని ఉత్తరంరాసి పడెయ్యాలి. ఉత్తరమే రాయకపోతే, మళ్ళీ వాడే రాస్తాడేమో, ఇన్నాళ్ళకు వాడు రాయకరాయక రాస్తే జవాబురాయకపోతే బాగుంటుందా ? ఉత్తరం మాత్రం రేపు రాసి పడెయ్యాలి.

ఫిబ్రవరి, నాలుగవ తేదీ 1951.

ఆదివారం. కొంచెం పని ఉందిగాని, బాంకుకి వెళ్ళలేదు. ఉదయం సుబ్రహ్మణ్యం వచ్చేడు. ఏవేవో చాలా కబుర్లు చెప్పేడు, వాళ్ళమ్మాయి కాపురం నిలబడేట్టు కనబడలేదట. పెళ్ళయేవరకూ ఈ సంబంధం ఎలాగయినా అయితే చాలుననుకోడం, వాళ్ళు చెప్పినషరతులన్నిటికి ఒప్పుకోడం తరువాత అన్నమాట నిలబెట్టుకోలేక, వాళ్ళు పట్టుపడితే, దుర్మార్గులు, హృదయంలేనివాళ్ళు అంటూ ఇక్కడా అక్కడా చెప్పుకోడం, ఏం లాభం. మొదటే నాలుగు సంగతులూ నిష్కర్షంగా అనుకొని, శక్తి ఉంటేనే ఒప్పుకోకూడదా? ఏదో తరువాత అదే సర్దుకుపోకపోతుందా అని ముందు కళ్ళుమూసుకొన్నందువల్లనే ఇటువంటి అనర్థాలు వస్తాయి. ఇప్పుడయినా తన మంచితనం, ఇబ్బందులు పడుతూండడం మొదలయినవాటిమీద ఉన్న దృష్టి కూతురు సుఖంమీద ఉన్నట్లు లేదు.

క్షవరం చేయించుకోడంమూలాన మధ్యాహ్నం భోజనం ఆలస్యమయింది. భోజనం అయేసరికి పన్నెండయింది. తరువాత పత్రిక చదవడం, నిద్ర. మధ్యాహ్నం కాఫీ తరువాత *J; B; Priestly* రాసిన *Three time plays* లో మొదటిది *The Dangerous corner* పూర్తిచేశాను. నాటకం బాగానేఉంది. కాని ఒకటే వింతగా తోచింది. నాటకంలోని అందరు మనుష్యుల నడుమనూ ఏవేదో అసందర్భమయిన సంబంధాలే. కొన్ని వ్యక్తమయినవీ, కొన్ని అవ్యక్తమయినవీ. బహుశ, *let sleeping dogs lie* అన్న అభిప్రాయాన్ని బాగా నాటేలాగ చేసేందుకు ఇన్ని మెలతలుపెట్టి ఉంటాడు. ఏమయినా నాటకం, రచయిత పీఠికలో చెప్పినట్టు, కాలానికి సంబంధించిన వైచిత్ర్యం దృష్ట్యానే కాకుండా చాలా బాగుంది! తక్కిన రెండు నాటకాల్లో ఏది అరంభించడమా అని ఆలోచిస్తూ ఉండగా విశ్వనాథమూ నారాయణమూర్తీ నరసింహం వచ్చారు. ఒక అరగంట బాతాఖానీ, తర్వాత షికారు. పార్కులో తెలుగువార్తలయేవరకూ కూర్చున్నాం. ఇంటికివచ్చే దారిలో రెండు తువ్వాళ్ళు కొన్నాను. ఒక్కొక్కటి రూపాయి ముప్పావలా. ఖరీదు ఎక్కువయినా బాగానే ఉన్నాయి. పంచలుకూడా కొనుక్కోవాలి. కాని, ఈ నెలలో కుదరదు. బుచ్చిబాబుకి పంపిన మనియార్డరు రసీదు రేపు రావాలి. కృష్ణశర్మ ఉత్తరానికి జవాబు రాయలేదు. రేపు తప్పకుండా రాసి పడెయ్యాలి.

*Priestly* నాటకాల్లో మధ్యది వెనక్కి ఉంచి, చివరిది, *I have been here before* చదవడం మొదలుపెట్టేను. చాలా బాగుంది. *Dangerous Corner* కంటెకూడా చదవాలనిపించేట్టుంది. ఇప్పుడు పదిగంటలవరకూ చదివితే మొదటి అంకం పూర్తికావచ్చును.

సిరిపురం,

7-2-51.

మిత్రుడు ధర్మారావుకి,

నీ నమస్కారాలు నీకు మళ్ళీ అందజేస్తున్నాను. నేననుకొన్నట్టుగానే అయింది. నీకు నా ఉత్తరంవల్ల రావలసినంత కోపమూ వచ్చింది. అయితే అసలే ఉత్తరం రాయకపోవాలన్నంత ఆగ్రహము రాకపోయినందుకు సంతోషమే.

ఇక, అసలు సంగతి నేను నీ కేమీ పెద్ద కష్టమయిన పని చెప్పలేదు. ఒక శెలవురోజున బయలుదేరి రమ్మన్నాను. ఇక్కడకు వచ్చిన తరువాత నీకు అంత చికాగ్గాఉంటే మర్నాడే బయలుదేరిపోవచ్చును. ఎప్పుడూ ఉన్న బాంకే కదా! ఒకటి రెండు రోజులు కాస్త మార్పుగా ఉంటుందనేనా నువ్వు రావచ్చును.

ఇంతకంటె నేను విశేషించి రాయవలసింది లేదు. నువ్వు ఈ ఆది వారంనాడు తప్పకుండా వస్తానని నమ్ముతున్నాను. రైలుకి బండీ తీసుకొని వస్తున్నాను. లేకపోతే నేనే బయలుదేరివచ్చి, నిన్ను తీసుకొనిరావలసి ఉంటుంది.

ఉదయం బండి ఇక్కడకు పదకొండు గంటలకి వస్తుంది. అందులో రావడమే సదుపాయము. మరి ఉత్తరాలకి వ్యవధిలేదు.

ఇంతే సంగతులు,

కా. కృష్ణశర్మ.

ఫిబ్రవరి, 11 వ తేదీ 1951,

మకాం : సిరిపురం.

ఉదయం ఆరుగంటల రయిల్లో బయలుదేరి ఇక్కడకు వచ్చాను. స్టేషనుకి శర్మ బండి తీసుకొని వచ్చాడు.

బండి ప్రయాణం సుమారు గంటసేపూ శర్మ తన మనసులు గిరీగురించి, ఊళ్ళోని పార్టీలగురించీ, చెప్పాడు. అందులోను తన పార్టీ అన్ని విషయాల్లోను ముక్కుకు సూటిగా పోతున్నప్పటికీ, రెండవ పార్టీవాళ్ళు ఎంతకీ సమాధానానికిరాక, కాలికివేస్తే మెడకీ మెడకి వేస్తే కాలికీ వేస్తూ వృథాగా కక్షలు పెంచడమే పనిగా పెట్టుకొన్నారట. అవతలి పార్టీవాళ్ళుకూడా సరిగా ఇలాగే చెప్తారేమో? ఎవరిపని వాళ్ళు చేసుకొని, హాయిగా ఉండరాదూ? ఒకవేళ ఎవడయినా అటువంటివాడున్నా ఉండనియ్యరు. ఏదో ఒక పార్టీలో చేరి తీరవలసిందే. లేకుంటే రెంటికీ విరోధికావాలి.

కృష్ణశర్మ బలంగానే ఉన్నాడు. కాని జుట్టు బట్ట గురించి ఏమాత్రమూ శ్రద్ధ ఉన్నట్టు లేదు. తలకూడా నాకంటె బాగా నెరసిపోయింది. కట్టుకొన్న పంచ ఖరీదయినదే. చొక్కాకి గుండీలులేవు. పైమీద ఒక తువాలు మనిషిలో పల్లెటూరి కళ బాగా వచ్చింది.

ముందు తమ యింటికి తీసుకొని వెళ్ళాడు. ఇల్లు చాలా పెద్దదేగాని, అంతా బూజుపట్టినట్టుంది. గోడలకు సున్నాలులేవు. ఇంటికిముందే పశువుల పాకలు. పరిశుభ్రత అనేది ఏమిటో తెలియని ప్రాంతమని స్పష్టంగా కనిపిస్తుంది. ముందు తమ యింట్లో కాఫీ ఇచ్చారు. ఆ ముసలావిడ వాళ్ళ మేనత్తట. ఎంతో ఆప్యాయంగా నిత్యమూ వస్తూపోతూన్న మనిషిని పలకరించినట్లుగా పలకరించింది.

కాఫీ పెద్ద వెండిగిన్నెతో ఇచ్చారు. అంత ఎక్కువగా అక్కరలేదనబోతూండగా అంతకంటె పెద్దదయిన తన గిన్నెలోని కాఫీ చూపించి మాకంటె తక్కువగానే ఇచ్చారులే. అయినా భోజనానికి గంట గంటన్నర వ్యవధి ఉందికదా అన్నాను. అప్పటికి పన్నెండు కావచ్చింది. అంటే మామూలుగా మధ్యాహ్న టిఫినువేళకు పగటి భోజనమన్నమాట!

తాతలనాటి పెద్ద పడక కుర్చీలో (దాని ప్రేముఅల్లిక చిరిగిపోతే బల్లలు వేయించినది) నన్ను కూర్చోమని తాను పక్కనున్న బల్లమంచంమీద కూర్చున్నాడు. ఇకను, తను చెప్పదలచిన భోగట్టా ఆరంభిస్తాడు కాబోలు ననుకొంటూ ఉండగా, ఉం డిప్పుడే వస్తాననీ ఎక్కడకో వెళ్ళిపోయేడు. ఆ వెళ్ళిపోవడం మరొక గంటవరకూ పునర్దర్శనంలేదు. ఈ మనిషి ఒక్కడూ ఇక్కడ ఏంచేస్తాడో అన్న ఆలోచనలేదు. కాలక్షేపానికి ఒక పుస్తకమయినా పడేసిపోతే?

వేళతప్పిన భోజనం. తరువాత అలవాటు లేదంటున్నా బలవంతంగా నల్లులమంచంమీద పడక. మాటలాడుతూనే (అయిదు నిమిషాల్లోనే) వాడు గుర్రుపెట్టి నిద్రకు దొరకున్నాడు. మంచంమీద మరి లాభంలేదని కుర్చీలో కూర్చున్నాను. అక్కడా నల్లులు తగుమాత్రంగా ఉన్నాయి — అయినా ఏమిటి చెయ్యడమో తోచకుండా, అథమం వచ్చిన పనిఏమిటో ఇదమిద్ధమని తేలకుండా కూర్చోడం చాలా కష్టమనిపించింది. వాడు నిద్రపోయినది అర గంటసేపే అయినా ఎన్నోగంటలయినంత బాధగా తోచింది. సాయంత్రం రయిలుకే బయలుదేరిపోవాలనిపించింది.

వాడు నిద్రలేచిన తరువాత కార్యక్రమం ఒక దారినిపడినట్టయింది. మళ్ళీ కాఫీ తాగినతరువాత "ఒక మారలాగా మా చెల్లెలుగారింటికి వెళ్లాము" అన్నాడు. దారిలో అతను తమ ఉత్తరం రాయడానికి ముఖ్యకారణం ఆమె భర్త పోయినతరువాత కొద్దికాలం తమ యింట్లోనే కలిసిఉండినా, అంతకంటె ఇదే మేలని ఆవిడ వేరే ఇల్లుకట్టించుకొని తనూ కూతురూ అందులో ఉంటున్నారనీ చెప్పాడు. అప్పటికీ నాకు, నన్ను బలవంతంగా రప్పించిన కారణం ఏమీ ఊహకందలేదు.

ఆవిడ మనిషినిచూస్తే వితంతువు అనుకోందికి ఏమీ అవకాశం కన బడదు. వయసు పాతికా నలభై మధ్యను ఎంతైనా కావచ్చును. ఆవిడకూడా బాగా తెలిసిన మనిషిని పలకరించినట్లుగానే పలకరించింది, తరువాత కొంతే సేపు అన్నా చెల్లెళ్ళ మధ్యను వాగ్వాదం. నన్ను తిన్నగా తమ యింటికి తీసురావలసిందని ఆమె, ఎక్కడయితేనేమి; ఈ రాత్రికికూడా మా యింట్లో ఉండి రేపు మీ యింటికి వస్తాడని అతనూ ఇద్దరూ కలిసి మొత్తానికి నేను సాయంత్రమే బయలుదేరాలనుకొన్నాననే మాటను చెప్పనివ్వకుండా చేసేరు. వాళ్ళ మాటలనుబట్టి చూస్తే నేనొక వారం పదిరోజులు అక్కడ ఉండే ఉద్దేశంతో వచ్చినట్టు కనిపిస్తుంది.

ఈ ఇల్లు ఒక్కటీ ఈ ఊళ్లో ఎక్కడనుండో తెచ్చిపెట్టిపట్టినిపిస్తుంది. ఇల్లేకాదు ఇంటిలోని సామాను, అలంకరణ అంతా మామూలుగా పట్న వాసాలలోని అధునాతనమయిన ఇళ్ళల్లో ఉన్నట్టే ఉంది. గదిమధ్య టేబిలు నాలుగు పంకలా నాలుగు కుర్చీలు ఒక ప్రక్కను చిన్న టేబిలుమీద రేడియో, కిటికీలోంచి పువ్వులమొక్కలు కనిపిస్తున్నాయి. కాఫీ ఫలహారము కూడా మోతాదుగానే సాగాయి. వాళ్ళమ్మాయి-పద్దెనిమిదేళ్ళుండవచ్చును.

పేరు లీల. ఇద్దరూ పక్క పక్కను కూర్చుంటే తల్లీకూతురూ అన్నట్టు కని పించలేదు. అక్కచెల్లెళ్ళలాగున్నారు.

ఆవిడ అనవసరపు ఉపోద్ఘాతం అట్టే లేకుండా అసలు విషయానికి వచ్చింది. వాళ్ళమ్మాయిని మా మేనల్లుడు బుచ్చిబాబు కిచ్చి పెళ్ళిచేసే వుద్దేశ మట. నాకు నిజంగా కోపంవచ్చింది. ఆవిడ నా మనసులోని మాట గ్రహించినట్టు, 'పెళ్ళిమాటలికి, అందులోనూపిల్లను ఇస్తామని చెప్పడానికి ఇది పద్ధతికాదు. మనమే అక్కడకు వెళ్ళి చెప్తామని అన్నాను. మా అన్నయ్యే కదలడానికి బద్దకించి ఇలా మిమ్మల్ని రప్పించా'డంది.

ఫలహారం తరువాత శర్మ ఏదో పనిఉందని ఇప్పుడే వస్తానని వెళ్ళేడు. నా బస యీ యింటికి మారిపోయినట్టే. ఆవిడ మేడమీదికి తీసుకొని వెళ్ళి "మీరు మధ్యాహ్నం విశ్రమించినట్టు లేదు. కాస్త విశ్రమించండి. అన్నయ్య మళ్ళీ వచ్చేసరికి ఏ సాయంత్రం అవుతుందో; ఇప్పుడే వస్తానంటాడు. ఎంతకీ మరి అయిపుఉండడు. ఈ వెధవ మునసబుగిరీ వాడి ప్రాణాలు తింటూంది." అంది. గదిలో మంచం, టేబిలూ కుర్చీలు అన్నీ చక్కగా అమర్చి ఉన్నాయి. గోడకి ఉన్న అద్దాల తలుపుల అలమారలో పుస్తకాలున్నాయి. ఇంగ్లీషు పుస్తకాలన్నీ పాతవే. కాని, తెలుగు పుస్తకాలు మాత్రం కొత్తవికూడా ఉన్నాయి. ఒక అరఅంతా పత్రికలు దేనిసంచికలు దానికి వరుసగా సర్దబడి ఉన్నాయి.

ఏదో పత్రికలు తిరగవేస్తూఉంటే నిద్రవచ్చింది. క్రిందనున్న రేడియోకి సంబంధించిన లౌడ్‌స్పీకర్ ఒకటి గదిలో ఉందన్న సంగతి అంతకుముందు గుర్తించలేదు. వాళ్ళు నాకు మెలకువ తెప్పించడానికే పెద్ద ధ్వనితో ప్రయోగించి ఉంటారు. అందులోనూ వచ్చిన ప్రోగ్రాము నాగస్వరం. మేడ మీదనే మొగం కడుక్కోందికి ఏర్పాటు చేయబడి ఉంది. ఇన్నిమార్లు కాఫీ తాగడం అలవాటు లేదంటున్నా ఆమె వినకుండా 'మా అన్నయ్యగారింటి లాగ పెద్ద గిన్నెలతో ఇవ్వడంలేదు. ఒక చిన్న కప్పు కాఫీ ఎప్పుడు తాగినా తాగవచ్చును' అంటూ తాగించింది.

నేను చెప్పవలసినమాట ఏదో స్పష్టంగానే చెప్పాను. వాళ్ళ తల్లి దండ్రులు ఉన్నారు. కుర్రవాడు కూడా బి. యస్. సి. చదువుతున్నాడు. మీరు ఇచ్చినా వాళ్ళు చేసుకొన్నా మధ్యను నా అంగీకారంలో ఏముంది అని. కానీ, ఆమెకు ఏమీ నమ్మకం కలిగినట్టులేదు. "మీ రెలా చెప్తే

వారలా చేస్తారట. పోనీ మీ వంతు మీరు ఇష్టపడ్డామనండి తక్కినది మా అన్నయ్య చూసుకొంటాడు" అంది. తరువాత మాటల్లో శర్మకూడా "అదేమిటోయ్ అలా అంటావు? కుర్రవాడు సాక్షాత్తు నీకు మేనల్లుడు. మరి నిన్ను కాకపోతే మరెవరిని అడగమంటావు? మరి మా లీల నాకు మేనకోడలే కదా? నేనేనా పూచీ అని పూనుకొని తిరగడంలేదా? మా లీలకు నేను వట్టి నోటిమాటతప్ప మరేమీ ఒరగబెట్టినదిలేదు. అసలు కుర్రవాని చదువు కయ్యే ఖర్చంతా నువ్వే భరిస్తున్నావట కదా?

ఇటువంటిధోరణి మనుష్యులతో ఎంత స్పష్టంగా చెప్పీ లాభంలేదు. అసలే చెప్పకుండా ఊరుకొంటే తమమాటని అంగీకరించినట్టే లెక్కకడతారు. తమకు సబబుగా తోచినది ఇతరులకు మరోకలాగ తోచడానికి వీల్లేదని వాళ్ళ నమ్మకం. ఏమయినా రేపు బయలుదేరేలోగా, శర్మతో లాభంలేదు, ఆవిడతోనే స్పష్టంగా చెప్పెయ్యాలి; - చదువుకి సాయంచేసినంత మాత్రాన వాళ్ళ యిష్టానిష్టాల ప్రసక్తి లేకుండా పెళ్ళిసంబంధం నిశ్చయించే అధికారం లేదని, ఉన్నా వినియోగించే ఇష్టం ఎంతమాత్రం లేదని, వివాహం అనేది, తల్లిదండ్రులూ. అంతకంటె ముఖ్యంగా వరుడూ తమ స్వంతబాధ్యతలమీద నిర్ణయించుకోవలసిన వ్యవహారం అనీను—వాళ్ళు ఏవిధంగా అర్థంచేసుకొన్నా చెప్పవలసిన మాటలు నాలుగూ స్పష్టంగా చెప్పేస్తే మరి తరువాత మొగమాట ముంచవలసిన పరిస్థితి రాదు. రేపు ఉదయం రైలుకే వీలుంటే బయలుదేరాలి; తప్పితే సాయంత్రం బండికిమాత్రం తప్పకూడదు.

బెనారెస్, 17- -51.

ప్రియమైన మామయ్యకు :

అనేక నమస్కారములు. ఇక్కడ నేను క్షేమంగా ఉన్నాను

నీవు వ్రాసిన ఉత్తరం అందింది. మాకు మార్చి ఆఖరులో శెలవులిస్తారు. అప్పుడు నువ్వు వ్రాసిన ప్రకారం సిరిపురం వెళ్ళడానికి నాకేమీ అభ్యంతరం లేదు. అంతకుమించి నే నేమీ హామీ ఇవ్వలేను నా పెళ్ళి గురించి. లోగడ మా అమ్మా నాన్నా తొందచేసినప్పటికి నువ్వు నాతో కలిసి ముందు నా చదువు పూర్తికావాలనీ, నేను నా కాళ్ళమీద నిలబడే సావకాశం కలగాలనీ అంటూండేవాడవు. అటువంటిది స్వయంగా నువ్వు ఈ విషయం రాసేవంటే, అందులోను ఆ ఊరువెళ్ళి అక్కడ ఉండి మరీ ఉత్తరం రాసేవంటే తప్పకుండా ఆలోచించదగిన పరిస్థితే అయి ఉంటుంది. అయితే ముందుగా అక్క-

డకు నీ మాటప్రకారం వెళ్తాను. అక్కడనుండి నీ దగ్గరకు వచ్చి తరువాత మా వూరు వెళ్తాను.

మా మిత్రుడు రాజశేఖరం ఈ శెలవులలో అజంతా, ఎల్లోరా మొద లయినవి తిరిగివద్దామంటున్నాడు. నా ఖర్చులన్నీ తానే భరిస్తానంటున్నాడు గాని, కొంచమయినా మనది అని లేకుండా ఉంటే బాగుండదనిపిస్తుంది. ఇప్పుడుమటుకు నేను వస్తాను రాను అని ఏమీ అతనితో నిర్ధారణంగా చెప్ప లేదు. నువ్వు ఇష్టపడితే, ఒక్క ఇష్టమేకాదు, ఏమయినా పంపిస్తానంటే, వెళ్తాను. లేదా తిన్నగా యింటికి వచ్చేస్తాను. ఈ ప్రయాణానికి మామూలు దానికి అదనంగా ఒక యాభైరూపాయలు ఉంటే చాలుననుకొంటాను.

మొన్ననే ఇంటిదగ్గరనుండి చెల్లమ్మ ఉత్తరం రాసింది అంతా క్షేమం. అమ్మకు యింకా పురుడు రాలేదట. అక్కయ్యను. పండగకు తీసుకొనివచ్చి యీ ఫస్టుతారీఖునే దిగబెట్టేసేరట. తమ్ముడు రామం బొమ్మలు-చూసి, మ్యునిసిపల్ చైయిర్మన్‌గారు స్కాలర్‌షిప్పు ఏర్పాటు చేయిస్తానన్నాడట. ఈ సంగతులన్నీ నీకూ ఉత్తరం వచ్చి ఉంటుందేమో, మొన్న పండగకి నువ్వు వస్తావేమోనని చాలా చూసేరట. పోనీ మా వేసవి శెలవులలో వస్తే నాలుగు రోజులు హాయిగా చదరంగం ఆడుకొనవచ్చును.

నీ ఉత్తరంకోసం ఎదురుచూస్తూ ఉంటాను.

బుచ్చిబాబు.

కృష్ణరాయపురం,
1-3-51.

క్షేమం.

శ్రీరస్తు చిరంజీవి బావమరిది ధర్మారావుకు, అనేక ఆశీర్వచనములు త॥ నీవు 24-2-51 తేదీని వ్రాసిన ఉత్తర మందినది. సంగతులు చూచి మేము యావన్మంది చాలా సంతోషించినాము. చి॥ బుచ్చిబాబువద్దనుండి నిన్ననే ఉత్తరము వచ్చినది, పెండ్లి సంబంధము విషయంలో. నీకు నచ్చినది అంటే మా అందరకు నచ్చినట్టే. వాడుకూడా చూసుకొన్న మీదట మరి మే మెవ్వ రమూ చూడనక్కరలేదు. కట్న కానుకల విషయంలోకూడా, నువ్వు ఆలో చించి ఎలా బాగుంటుందంటే అలా చేయవలెను. ఆడపిల్లలు చిన్నపుచ్చు కొంటారు. గనక వాళ్ళ లాంఛనాల విషయంలో మాత్రం తక్కువ చేయవద్దని

మీ చెల్లెలు రాయమన్నది. ఏదో భగవత్కటాక్షమువలన ఈ వ్యవహారం స్థిరపడి, సవ్యంగా నెరవేరితే చి॥ బుచ్చిబాబు విద్యావిషయమై నీకు కలుగుతున్న ఒత్తిడి తగ్గుతుంది. అన్ని విషయములుఆలోచించి ఎలా బాగుంటుందంటే అలా చేయవలెను. ఇక్కడ పిల్లలందరూ కులాసాగా ఉన్నారు. చి॥ రామానికి స్కాలర్‌షిప్పు దొరికింది. శ్రీ సంజీవరావు పంతులుగారు "వారాలకు ఏం తిరుగుతావు, మా యింట్లోనే భోంచెయ్యి" మన్నారట — చి॥ పిల్లలు నీవు పండగకి వస్తావని చూసేను వీలుంటే ఒక పర్యాయము రాగోర్తాను! శ్రీ శ్రీ శ్రీ.

ఇంతే సంగతులు,

గ్రహించవలెను.

కా. సోమసుందరం వ్రాలు.

సిరిపురం, 10-3-51.

మిత్రుడు ధర్మారావుకు,

మా చెల్లెలు సుభద్రమ్మ మరీ మరీ తొందరచేయగా నీ కిది వ్రాస్తున్నాను. మీ మేనల్లుడు కృష్ణమూర్తికి శెలవు లివ్వగానే ఇక్కడికి ఒక్క పర్యాయము వచ్చి వెళ్ళవలసిందిగా పదేపదే వ్రాయమంటున్నది. స్వయంగా చూచేవు గనక దాని ఆందోళన నీకు తెలియనిది కాదు. కుర్రవాడు వచ్చి పిల్లను చూసుకొన్న మీదట నీకు వీలుంటే ఒక పర్యాయము వస్తే కట్నం కానుకల విషయం నిశ్చయంగా మాట్లాడుకొందాము. లేదా మేమే అక్కడకు వచ్చి నాలుగు సంగతులు మాట్లాడుతాము. కావాలంటే మీ చెల్లెలుగారి ఊరుకూడా వెళ్తాము. మీ మేనల్లుడు చిరంజీవి కృష్ణమూర్తి ఎప్పట్లో బయలుదేరివచ్చేదీ వ్రాయగోర్తాను. వెంటనే జవాబు రాస్తారని నమ్ముచున్నాను.

ఇంతే సంగతులు,

కా. కృష్ణశర్మ.

మార్చి, 15 వ తేదీ 1951.

ఏమీ విశేషాలు లేవు. మామూలుగా బాంకు — సాయంకాలం పార్కు దారిలో పెంగ్విన్ ఎడిషన్ హక్స్లీ *Antic hay* కొన్నాను — పుస్తకం చిత్రంగానే ఉండేలాగుంది. లోగడ చదివిన *Point Counter Pount*

ఘోరణికీ *After many A Summer* కీ చాలా భేదం ఉన్నట్టుంది. వాటికంటె చాలా ముందురాసిన రచనలు. ఈ ఆదివారం రాత్రికి చదవడం పూర్తి కావచ్చును.

ఉత్తరాలు కృష్ణశర్మకీ, బుచ్చిబాబుకీ రాసేను. రెండూ - కార్డులే. వాళ్ళు రాసిన బోగట్టా వీడికీ, వీడికి రాస్తున్నానన్న సంగతి వాళ్ళకీ వ్రాశాను.

వాళ్ళు తప్పకుండా తమ పిల్ల పెళ్ళి విషయంలో తొందరపడవలసిన మాటె. వీడికి మంచిసంబంధం దొరికి కాస్త కట్నంరూపేణ వీళ్ళ కుటుంబానికి లాభించడమూ వాంఛనీయమయిన సంగతే. అయితే ఆయా సంగతులు వాళ్ళ వాళ్ళ స్వంతబాధ్యతలమీద నిర్ణయించుకొంటే తరువాత మంచి అయినా చెడ్డ అయినా ఉభయులూ కలిసి, మధ్యవర్తినెత్తిని అక్షింతలు వెయ్యనక్కరలేదు. బావకిరాస్తే, నాదేముంది అంతా నీ యిష్టం ఎలా బాగుంటుందంటె అలా చెయ్యి అంటాడు. కాని, నా బాగుండటంతో ఏమిటి సంబంధం? అసలే కట్నం పుచ్చుకోకపోడం నాకు బాగుంటుంది. తాము అందుకు ఇష్టపడగలరా? కాక, ఒకవేళ వాళ్ళు యిష్టపడినా, అది తమకు తాము నష్టం చేసుకొంటున్నట్టే కదూ? ఎప్పుడో వాడు ఉద్యోగం చేసి ఇచ్చేడబ్బు ఈనాడు కట్నంరూపంలో వస్తే చేదా? అందులోనూ ఇంకా పెళ్ళిచెయ్యవలసిన ఆడపిల్లలూ, చదివించవలసిన మగపిల్లలూ బోలెడు మంది ఉన్నారు. అందుచేత బావకి ఈ అంశంలో స్పష్టంగా రాయాలి. వాళ్ళకికూడా ఇందులో నా ప్రమేయం అట్టే లేదనీ, వ్యవహారం తామూ తామూ నడిపించుకొంటే బాగుంటుందనీ నిక్కచ్చిగా రాసెయ్యాలి.

ఇంకా వాడు చూసి ఇష్టపడాలికదా! ఎలాగూ ఇష్టపడతాడు. తప్పక మర్నాడు వచ్చితీరాలనుకున్న నన్నే అయిదు రోజులపాటు ఉంచగలిగేరు. ఆ తల్లికూతుళ్ళు—పాపం, ఆ ఊళ్ళోవాళ్ళకు సౌకర్యాలకు లోటు లేకపోయినా, వాళ్ళకు కావలసిన రకం సంఘంలేదు. ఒంటరిగా ఏదో దేశం కాని దేశంలో ప్రవాసం అనుభవిస్తున్నట్టున్నారు. అయినా ఆ మాట ఒప్పుకోరు. మనుష్యులకి తాము చేసినది పొరపాటని తెలుస్తున్నా, ఇతరులు చేస్తే మాత్రం అంగీకరించాలని ఉండదు. ఆ యిల్లుని విడిచిరావడం కష్టమే! కాని డబ్బు పెడితే మరొకచోట అటువంటిచోట ఇల్లు వస్తుందిగాని, అక్కడ ఎంత కాలం ఉన్నా వాళ్ళు కొత్తగావచ్చిన మనుష్యులలాగే కనిపిస్తారు. ఆవిడ

ఉద్దేశంకోసం ఈ పిల్లను త్వరగా పెళ్ళిచేసేసి, వాళ్ళతోపాటు తానూపోయి ఏ పట్నంలోనో ఉండవచ్చునని అన్నట్టుగా ఉంది. ఎవరి ఉద్దేశాలు ఏమయినా, మన నెత్తిని అక్షింతలు పడకుండామాత్రం చూసుకోవాలి.

సిరిపురం, 12-4-51.

ప్రియమైన మామయ్యకు,

అనేక నమస్కారములు. ఈ రోజు ఉదయం క్షేమంగా ఇక్కడకు చేరుకున్నాను. నేను ఈ సాయంత్రమే బయలుదేరుతానన్నాను. వాళ్లు నాలుగు రోజులుండి వెళ్ళుదువుగాని అంటున్నారు. ఏమయినా రేపు సాయంకాలం బండికి బయలుదేరడం జరుగుతుందనుకొంటాను.

న్యాయంగా మా సంచార కార్యక్రమం అనుకొన్నట్టు జరిగిఉంటే, మరొకనెల్లాళ్ళ అనంతరం అంటే మేనెల పదవతేదీ ప్రాంతంలో ఇక్కడకు రావడం జరిగిఉండేది. కాని, మా మిత్రుడు రాజశేఖరం తల్లిగారికి వంట్లో బాగులేదని టెలిగ్రాము రావడంతో కార్యక్రమం తారుమారయింది. వాడు ఇంటికి వెళ్ళాడు. నేను ఇక్కడకు వచ్చాను. వాడు మళ్ళీ అక్కడ పరిస్థితి బాగుపడ్డాక ఉత్తరం వ్రాస్తానన్నాడు. నువ్వు దయతో పంపిన అరవై రూపాయిలూ అలాగే ఉన్నాయి, వాడు నన్ను ఒక రూపాయికూడా ఖర్చు పెట్టనియ్యలేదు. అక్కడికీ టిక్కట్టుకూడా తీసుకొన్నాడు.

నేను రేపు రాత్రి రయిలులో బైలుదేరి వస్తున్నాను.

బుచ్చిబాబు.

క్షేమం. కృష్ణరాయపురం :

శ్రీరస్తు చిరంజీవి బావమరిది ధర్మారావుకు : 1-5-51

అనేక ఆశీర్వచనములు. తా॥ ఇక్కడ మేమంతా క్షేమంగా యున్నాము. అక్కడ నీ క్షేమసమాచారం వ్రాయించగోర్తాను. చి॥ బుచ్చిబాబు శలవులలో తన మిత్రుడు రాజశేఖరం అనే కుర్రవానితో కలిసి దేశసంచారంచేసే తలంపుతో ఉన్నట్టున్నాడు. అందులకు నీవు అనుమతించడమేకాక ఖర్చుల నిమిత్తం డబ్బుకూడా పంపించావనీ వ్రాసినాడు. తర్వాత బయలుదేరినట్టును, ఏవో రెండు మూడు ప్రదేశములు చూచినట్టును ఉత్తరములు చేరినవి. తరువాత సుమారు నెలదినములనుండి వాడివద్దనుండి ఎట్టి ఉత్తరమును లేకుండు

టచే మిక్కిలి ఆందోళనగా యున్నది. శలవులుకదా యని కాలం వృధా చేసినట్లయితే తరువాత చదువుకొనుట కష్టముకదా? వాడు ఎక్కడ ఉన్నది ఏమి చేయుచున్నది నీకు ఉత్తరము వ్రాసినయెడల వాని. క్షేమసమాచారము వెంటనే తెలియజేయగోర్తాను. ఇచ్చట పిల్లలందరునూ వానికొరకు ఆతృతగా ఎదురు చూచుచున్నారనీ, వెంటనే బయలుదేరి రావలసిందనీ వానికి వ్రాయ గోర్తాను. నీ ఉత్తరంకోసం ఆతృతగా ఎదురుచూస్తూ ఉంటాము. బైటికి అనకపోయినా వాళ్ళమ్మకు వానినిగురించి చాల బెంగగా యున్నది.

ఇంతే సంగతులు: గ్రహించవలెను,

కో॥ సోమసుందరం వ్రాలు.

సిరిపురం, 1-5-51.

మిత్రుడు ధర్మారావుకు!

మీ మేనల్లుడు ఇక్కడే కులాసాగా ఉంటున్నాడు. తోడుగా మా బావమరిది. అతని స్నేహితుడుకూడా ఉన్నారు. మావాడు కవి; ఆ రెండవ వాడు చిత్రకారుడు — ముగ్గురికి బాగా స్నేహం కలిసింది. ఈ పదిహేను రోజులక్రితంవరకు వీళ్ళు ఒకళ్ళ నొకళ్ళు చూసుకోలేవంటే ఎవ్వరూ నమ్మ లేరు. వీళ్ళకి సమఉజ్జీగా ఉంది మా లీలకూడా.

అసలు రాద్దామనుకొన్న సంగతి మరచిపోతున్నాను. మా చెల్లెలు సుభద్రమ్మ వీలయినంత త్వరలో వివాహం చేసే తలంపుతో ఉంది. మీరంతా యిష్టపడితే తను ఈ శలవు లాఖరులోగానే, వైశాఖంలో ముహూర్తాలున్నట్లు న్నాయి, జరిపించే ఉద్దేశంతో ఉంది. అందుచేత కట్న కానుకలవిషయమై నీవు వచ్చి మాట్లాడితే బాగుంటుంది. లేదా, ఫలానా అని ఉత్తరంలో స్పష్టంగా రాసినాసరే. మనుష్యుల్ని రమ్మన్నా సిద్ధమే. మరి అట్టే వ్యవధి లేదు కనుక వెంటనే నిశ్చయించగోరుతున్నామని వ్రాయమంది — వధూ వరులు పరస్పరం నచ్చడం విషయంలో మరేమీ అనుమానం లేదు గనుక, సాధ్యమయినంత త్వరలో ముహూర్తం నిశ్చయపరచడం బాగుంటుంది. పెళ్ళి ఎక్కడ జరగాలి, ఏవిధంగా జరగాలి అనే విషయమంతా నిర్ణయించే భారం మీదేననీ, మీ రెలా అంటే అలా జరిపించగలవారమనీ, మా చెల్లెలు రాయమంది — ఈ ఆదివారంనాటికి నువ్వు రాగలిగితే చాలా బాగుంటుంది నీ ఉత్తరంకోసం ఎదురుచూస్తూ ఉంటాము. కా॥ కృష్ణశర్మ.

మే, అయిదవ తేదీ 1951.

ఆదివారం ఉదయం అంతా ఒకరి తరువాత ఒకళ్ళు నరసింహం, విశ్వనాథం, సుబ్రహ్మణ్యం వచ్చేరు—తీరుబాటుగా ఉండి ఏమీ తోచక ఎవళ్ళయినా వస్తే బాగుండు నన్నవాడు ఎవరూ కనిపించరు. కాస్త, ఏదో స్వంతంగా ఆలోచిద్దాము, ఏమో పనిచేసుకొందాము అన్నవాడు అందరూ తయారు. అందులోనూ ఒకడు వెళ్ళిపోయేడు. బాగుంది, ఇక తీరుబాటుగా కూర్చుందాము అన్న సమయంలో సరిగా మరొకడు ప్రత్యక్షం. అంతేకాదు, నీ కేదో పని తొందరగా ఉంది కాబోలు నంటూనే పేకాట వేసుకొందామా? అనీ ఆ మధ్యను కొత్త గ్రామఫోను ప్లేట్లు కొన్నావుట, నేను వినలేదనీ, నిజంగా అవి వినడం పనిమీదనే వచ్చినట్టు మాట్లాడ్డం - అందరిలోనూ సుబ్రహ్మణ్యమే నయం. ముందుగా తను వచ్చిన చేటుకుంపని చెప్పేసి తరువాత మాటలు మొదలుపెట్టేడు. ఉదయం ఈవిధంగా మాటలు, తన్మూలంగా భోజనం పన్నెండు గంటలు కాకుండా ఉంటే ఇవాళ పదకొండు గంటల రైల్లో కృష్ణరాయపురం బయలుదేరి ఉండేవాణ్ణే! సరే పోనీ ఇదీ ఒకందుకు మంచిదే - నాలుగు సంగతులూ నింపాదిగా ఆలోచించి ఒక నిశ్చయానికి రావచ్చును.

మనుష్యులకు ఎవరిమీదనో ఒకరిమీద నమ్మకం ఉండడం మంచిదే, కాని, ఆ నమ్మకం అన్నది తమ బాధ్యతలను గురించి తాము ఆలోచించకుండా ఇతరులమీద భారంవేసి ఊరుకొనే పద్ధతివల్లమాత్రం ఎవరికీ ప్రయోజనం లేదు.

బావగారికి మంచికో చెడ్డకో నామీద యింత నమ్మకం ఉండడమే ఒక పెద్ద చిక్కుగా ఉంది. నా మాటమీద ఈ వివాహం జరిగిందంటే, తరువాత వచ్చే, మాట పట్టింపులకూ స్పర్థలకూ బాధ్యత నాదేగా ఎంచబడుతుంది. బైటికి అనకపోయినప్పటికీ, అంతేకాక, ఇది వాళ్ల కుటుంబ శ్రేయస్సుదృష్ట్యా మంచిదా కాదా అన్నది నిర్ణయించుకోవాలి. అయితే, బుచ్చిబాబు సర్వవిధాలా యిష్టపడినప్పుడు, తక్కిన కుటుంబంకోసం వాడు తన సౌఖ్యాన్ని త్యాగం చెయ్యవలసి ఉంటుందా? ఇది పైవాళ్ళకంటె వాడు కుర్రవాడయినప్పటికీ తానే స్వంతంగా ఆలోచించి నిర్ణయించుకోవలసిన వ్యవహారం. మర్నాడే బయలుదేరి వస్తానన్నవాడు నేటివరకూ యింటికిగాని, ఇక్కడికిగాని ఉత్తరంలేకుండా అక్కడే ఉంటున్నాడంటే అక్కడి ఆకర్షణశక్తి

ఎంత బలమైనదో అర్థమవుతుంది. మరి యీ ముజు మారీ వ్యవహారం లాభం లేదు. వాడికి అన్ని సంగతులూ స్పష్టంగా రాయాలి. తరువాత వాడి యిష్టం - ఎప్పుడో లాభం లేదు, ఇప్పుడే ఉత్తరం రాసెయ్యాలి. ఈ వివాహాల మూలంగా వాడు తన కుటుంబానికి ఎలా దూరం అయిపోతాడో అది స్పష్టంగా రాయాలి. అప్పటికీ వాడు కావాలని చేసుకొంటే వాళ్ళ అదృష్టం ఎలా అంటే అలా ఉంటుంది - పెళ్ళికాక మునుపు పెళ్లిచూపులకని ఒకపూట ఉండి రావడానికి వెళ్ళినవాడు ఇన్నాళ్ళు ఉండిపోయినప్పుడు పెళ్లితరవాత అక్కడే స్థిరంగా ఉండిపోడనడానికి ఏమిటి ఆధారం ? ఈ సంగతులన్నీ వారికి నిర్మొగమాటంగా తెలియజేసి తన యిష్టం ఏదో నిర్ణయించుకోమనాలి; ఆది నిష్ఠురమే నయం కదా ?

కృష్ణరాయపురం,
**12-5-51.**

ప్రియమయిన మామయ్యకు !

అనేక నమస్కారములు.

నీ ఉత్తరం అందిన నాటి సాయంకాలమే బయలుదేరి ఇక్కడికి వచ్చేను. దారిలో నీ దగ్గరకు రానందుకు ఏమీ అనుకోరని నమ్ముతున్నాను. ఎదురుగా మాట్లాడేకంటె ఉత్తరంలోనే నా అభిప్రాయాలు స్పష్టంగా తెలియజెయ్యగల ననుకొంటున్నాను. అసలు ఇంతకీ తెలయజెయ్యడానికి అట్టేలేదు. కారణం ఏదయితేనేమి, వాళ్ళ సంబంధం మనకు కుదరదు - వాళ్లు ఇదేమీ పెద్ద ఆశాభంగం అనుకోనక్కరలేదు. లోగడ వా రెందరినో ఆహ్వానించి, తీరా వచ్చినతరువాత దాసరీ నీ కన్నా లొట్ట అనకపోలేదు. ఇంతకీ వివాహం అనేది కేవలం వాళ్ళ సదుపాయంకోసం జరిగే వ్యవహారం కాదుకదా !

నిజంగానే నీ ఉత్తరం వచ్చి ఉండకపోతే వాళ్లుగాని "పెళ్లి అనే దానికి పెద్ద ఆడంబరం ఎందుకు ? పెళ్లికొడుకూ పెళ్లికూతురూ అంగీకరించి, మంచిరోజు కుదిరితే చాలదా" అని ఏదో రోజున ఎవ్వరూ లేకుండా పెళ్లి జరిపించినా నా అభ్యంతరం ఉండకపోయేదేమో ? అసలు నేను ఏమయినా ఆలోచించితేకదూ ? నువ్వు మొదట ఈ సంబంధంగురించి ఉత్తరం రాసేవు గనక నీకు యిష్టమే. నీ యిష్టమైనప్పుడు అమ్మకీ నాన్నకీ ఏమీ అభ్యంతరం

ఉండదు. ఇంతే నా ఆలోచన. పైగా అక్కడి వాతావరణంకూడా అంతా చిత్రంగా ఉంది. నాగురించి నేను ఆలోచించుకొందికి ఒక్క క్షణమయినా తీరికఉంటే కదూ! ఈ సందర్భంలో నా కనువిప్పు చేసినందుకు నీకు ఎంతయినా కృతజ్ఞుణ్ణి -

నేను ఈ మాట చెప్పడంతో మా అమ్మవాళ్ళకూ కొంచెం ఆశాభంగం అన్నట్లనిపించింది. వాళ్లు యిది పూర్తిగా నిశ్చయమైనట్టుగా ఊళ్లో వాళ్లతో కూడా చెప్పేశారు - వాళ్ళకు భవిష్యత్తులో నువ్వూ నేనూ చూడగల యిబ్బందులు ఏమీ గోచరించవు - మనం చెప్పినా అర్థంచేసుకోరు. తగిన కట్నం ఇస్తున్నప్పుడు, పిల్ల రూపసి అయినప్పుడు అడ్డు చెప్పవలసిన కారణం ఏముంటుందని. నేను ఎక్కువగా చెప్పడానికి ప్రయత్నించలేదు. ఏం చెయ్యమంటావు" అన్నాడు.

నేను ఇక్కడికి వచ్చిన మర్నాడే మా మిత్రుడు రాజశేఖరం దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. వాళ్ళమ్మగారి వంట్లో కులాసాగా వుందట, మా ఆగిపోయిన సంచార కార్యక్రమం పూర్తిగావించుకొనే, ఉద్దేశంతో రేపు రాత్రికి ఇక్కడికి వస్తున్నానని రాశాడు. ఎల్లుండి ఉదయం బయలుదేరుదామనుకొంటున్నాము. మా నాన్నగారికి నేను చదువు అశ్రద్ధచేస్తానేమో నని భయం. కాని యీ నెల్లాళ్లూ నిజమయిన శెలవులన్నట్టుగా తిరిగితే తక్కిన ఏడాది అంతా ఈ జ్ఞాపకంతో శ్రద్ధగా చదవడం జరుగుతుందని, తప్పకుండా ఫస్టుక్లాసు తీసుకొని వస్తానని హామీ అయనకు యిచ్చి బయలుదేరుతున్నాను-ఈ ప్రయాణం చివరిభాగంలో ఢిల్లీ, ఆగ్రా మొదలయినవి చూసి, సెలవు లాఖరుకి బెనారెస్ వెళ్ళతాము. అందుచేత నువ్వు మళ్లీ నెల డబ్బు హాస్టల్ ఎడ్రసుకే పంపించగోర్తాను. మా ప్రయాణపు విశేషాలు నోట్ చేసి ఉంచుతాను. వీటికి లోగడ పదిహేనేళ్ళ క్రితం నీ ప్రయాణపు విశేషాలతో పోల్చి చూడడం తమాషాగా వుంటుందికదూ! అప్పుడు నీ సంచారం గురించి ఎక్కువ ఆలోచించడమే ఇప్పటి మా సంచారానికి కారణమేమో" నేనేదో మాటవరసకు "ఎప్పుడూ ఇల్లూ కాలేజీ ఇంతకంటె మరేమీ లేకుండా వుండేకంటె, దేశం అంతా ఒకమారు తిరగవేస్తే ఎంత బాగుంటుంది?" అన్నాను. అతను రాజశేఖరం తరవాత మరి నేను ఎన్ని అభ్యంతరాలు చెప్పినా వినిపించుకోలేదు. ప్రస్తుతానికి రాయడానికి మరేమీ విశేషాలు లేవు.

—బుచ్చిబాబు.

సిరిపురం, 15-5-51.

మిత్రుడు ధర్మారావుకు!

సుమారు వారంరోజుల క్రితం మీ మేనల్లుడు చి॥ కృష్ణమూర్తి ఇచ్చటనుండి బయలుదేరి వెళ్ళినాడు. ఇంతవరకూ ఏమీ వుత్తరం లేదు. మా చెల్లెలు పెళ్ళిప్రయత్నాలు చేయుచున్నది - ముహూర్తంకూడా చి॥ కృష్ణమూర్తికి శలవులుండేటప్పుడే నిర్ణయించడం మంచిది అనుకొంటున్నాను - నీకు ఇక్కడికి రావడం అసదుపాయంగా వుంటుందనే కారణంతో నేనూ మా చెల్లెమ్మా బయలుదేరి అక్కడకు వస్తున్నాము - ఎల్లుండి వుదయం రయిల్లో బయలుదేరి వస్తున్నాము - అన్ని సంగతులూ ముఖస్థంగా మాట్లాడుకో వచ్చును - ఇంతే సంగతులు.

కా॥ కృష్ణశర్మ.

మే 18 వ తేదీ 1951

వుదయమే కృష్ణశర్మ దగ్గరనుండి వుత్తరం. పన్నెండు గంటలకి మనుష్యుల ఆగమనం. వస్తున్నామంటే ఊళ్ళో మరెక్కడో బసచేస్తారను కొన్నానుగాని, తిన్నగా ఇక్కడే వస్తారనుకోలేదు - వాళ్ళ ధోరణిచూస్తే, కేవలం మాటలకోసం వచ్చినట్లు లేదు - ఏదో డాక్టర్ చేత పరీక్ష చేయించ వలసినఅవసరంకూడా వుందట. హోటలునుండి తెప్పించుకొని భోజనం చెయ్యడం ఆవిడకు మరేమీ వింతగా తోచలేదు.

పెళ్ళిమాటల ప్రసక్తి మరి నిలిచిపోయినట్లే అనడంతో శర్మకి చాలా కోపం వచ్చింది ఆవేళ. మొదట కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. తరవాత తన అన్నగారి ధోరణిని సమర్థిస్తూ మాట్లాడ్డం మొదలుపెట్టినా, శర్మకంటె సబవరిగా మాటాడింది, నేను వేసిన ప్రశ్నలకు సరిఅయిన సమాధానాలు చెప్పలేకపోయేనని ఒప్పుకొంది - నేను వేసిన ప్రశ్నలు యివి: "పెళ్ళి అయినవెంటనే మీరు మీ అమ్మాయిని విడిచివుండగలరా? అసలు మీ అమ్మాయి మిమ్మల్ని విడిచిపెట్టి ఆ సమిష్టి కుటుంబంలో మనగలదా? అందులోనూ మా బావగారి ఎలిమెంటరీ స్కూలు హెడ్మాష్టరు వుద్యోగం, ఎనమండుగురు పిల్లలుగల సంసారం, తర్వాత పిల్లలందరి చదువుల పెళ్ళిళ్ళ బాధ్యత అంతా వాడే భరించవలసి రావడం మీకు సమ్మతంగా వుంటుందా? వాడు చాలా తెలివయినవాడే, కాని, మీ రనుకొన్నట్లుగా పెళ్ళిచేసుకొని అ

పల్లెటూళ్ళో కూర్చోడంతో తుప్పుపట్టిపోతాడు - ఇందు మూలంగా వాడికి మీరు అనవసరంగా ఇన్ని సమస్యలు లేకెత్తడంతప్ప, మరేమయినా వృథా యోగం వుంటుందా?" - ఆయా ప్రశ్నలను విని ఆవిడ ఇలా అంది. "మేము కుర్రవాడు చాలా తెలివయినవాడనీ, రూపసి అనీ విని ఎంతో ఆశపెట్టుకున్నాము. లోగడ ఈవిధంగా ఎందరినిచూసినా, యిష్టపడని మా లీల మీవాణ్ణి చూడగానే ఎంతో సంతోషించింది - మీ మేనల్లుడుకూడా పూర్తిగా యిష్టపడ్డాడు. మీరు ఏవేవో ఊహాలూ అపోహాలూ చేసి, వాళ్ళిద్దరినీ ఎడంచేసేరు. ఆయా సమస్యలన్నీ ముందుగానే ఊహించలేకపోయేరా? అలా అయితే రెండువంకలా యింతటి ఆశాభంగం లేకపోవునుగదా!" నన్ను మరి సమాధానం చెప్పనియ్యకుండా కృష్ణశర్మ అడ్డుపడ్డాడు, ఏదయినా ఉత్తరాలలో ఈ వ్యవహారం జరిగేకంటే ఈవిధంగా ముఖాముఖీ మాటలలో తేలిపోవడమే బాగుంది.

ఇక వాళ్ళ వైద్యం వ్యవహారం మరొకటి రెండురోజులు పట్టేలాగుంది. ఒకటి రెండు రోజులు ఉండే ఉద్దేశంతో వచ్చినవాళ్లు పరుపులూ వగైరాలు తెచ్చుకొంటే బాగుండును కదా! ఇవాళికి ఎలాగో సర్దుకున్నాము. తాత మడతమంచమూ, కాంపుకాటు బైటికి తీసేము, ఆవిడ ఇవతల మాట్లాడుతూనే అవతల మామూలుగా తమ యింట్లో సర్దుబాటు చేసుకొన్నట్టే సామానులు అటూ ఇటూ సర్దసాగింది. కొద్దిసేపట్లో గదిని కొంత అందంగా తయారు చెయ్యగలిగింది - భోజనానంతరం కడుపులో నొప్పివస్తున్నదట. ఎంత తక్కువగా తిన్నా యీ నొప్పి తప్పడంలేదట. ఇక్కడ డాక్టరు పార్థసారథి గారికి చూపించడం ఉద్దేశమట. సరే వాళ్లిష్టం, ఇక్కడ ఈ బ్రహ్మచారి యింట్లో యిముడగలిగివారంటే నాకేం అభ్యంతరం. రేపు మరి శెలవు అక్కర్లేదు. మామూలుగా బేంకుకి వెళ్లిపోవచ్చును. కొంత చికాకు తప్పనప్పటికీ, యిక్కడి ఈ వ్యవహారం పరిష్కారం అయిపోయినట్టే - బుచ్చిబాబుకి ఈ సంవత్సరంకూడా డబ్బు పంపించాలి. తరువాత సంగతి ఏమిటో ఆలోచించి నరుక్కురావచ్చును. వాడికీ ఎమ్. ఎస్. సి. చదివి లెక్చరరు కావాలని ఉంది. అదే మంచిదేమో, వాళ్ళ తమ్ముళ్ళ కాలేజీ చదువులవేళకు అందివస్తాడు.

సిరిపురం, 24-5-51.

మిత్రుడు ధర్మారావుకి !

మేము ఇక్కడికి వచ్చేసరికి ఒక అనుకోని సంఘటన జరిగింది. మా మేనకోడలు లీల మా బావమరిది స్నేహితుడు ఆ చిత్రకారుడు రాజరత్నంతో లేచి వెళ్ళిపోయింది. ఎక్కడకు వెళ్ళేరో తెలియదు. అక్కడకు మీ దగ్గరకు వస్తున్నామని మేము బయలుదేరిన మర్నాడే బయలుదేరేరట. దాని ఒంటినున్న బంగారమేకాక మా చెల్లెలు పెట్లో వస్తువులుకూడా కొన్ని తీసుకొని వెళ్ళిపోయేరు. మా చెల్లెలుకి మతి చలించినట్లయింది. ఎవరితోనూ మాట్లాడ్డంలేదు. తిండికూడా సరిగా తినడంలేదు. ఇందుకు, నువ్వు ఎంత లేదన్నా, బాధ్యత నీదే. మా లీలకు మీ మేనల్లుడు రాసిన ఉత్తరం ఒకటి దొరికింది - అందులో మొన్న నువ్వు మాట్లాడినట్లుగానే సంబంధం బెడిసిపోయిన సంగతి నిష్కర్షగా రాసిఉంది. ఆ ఉత్తరం అందినమీదనే అది ఇటువంటి తొందరపాటు పనిచేసి ఉంటుందనుకొంటాము. ఏంచేస్తాం, అది మరొక ఏడాదినాడు ఎటువంటి స్థితిలో ఇంటికి తిరిగివచ్చినా విశేషంలేదు; అసలు మళ్ళీ ఎన్నటికయినా తిరిగివస్తుందో రాదో? మాకీ పల్లెటూరికి ఏసంగతీ తెలియదు. నీకుగాని వాళ్ళ భోగట్టా ఏమయినా ఆచోకీ తెలిస్తే రాస్తానని నమ్ముతున్నాను. లేక, ఆమాత్రం బాధ్యత ఎందుకు నెత్తిని వేసుకోడం అనుకొంటావా ? మా చెల్లెలు కడుపునొప్పి అలాగే ఉంది. మొన్నటి మాటు రావడంలో డాక్టరుగారు కొన్నాళ్ళపాటు అక్కడ ఉండాలన్నారు. నాకు ఇప్పుడు ఏమీ తీరుబాటుకాకుండా ఉంది. మరొక పది పదిహేను రోజులలో బయలుదేరివస్తే బాగుంటుందనుకొంటున్నాను. అక్కడకు వచ్చిన మీదట ఒక యిల్లు అద్దెకు తీసుకోవాలనుకొంటున్నాను. నీకు వీలయితే ఒక చిన్న యిల్లు, శుభ్రమయినది చూస్తే చాలా సంతోషిస్తాను. మా చెల్లెమ్మ ఒక్కతే ఉంటుంది; నేను అప్పుడప్పుడు వచ్చి వెళ్తూవుంటాను ఇంతే సంగతులు.

కా॥ కృష్ణశర్మ.

సిరిపురం, 24-9-51.

మిత్రుడు ధర్మారావుకు !

నిన్ననే మా చెల్లెమ్మ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. ప్రస్తుతం నా దగ్గర డబ్బు సర్దుబాటు కావడంలేదు. వాళ్ళ రైతులుకూడా ఇంకా పరి

కొన్నాళ్ళు పోతేనేకాని ఇవ్వమంటున్నారు. అందుచేత నువ్వు ప్రస్తుతానికి ఒక నూరురూపాయలు సర్దుబాటుచేసి ఇవ్వగలిగితే మరి పదిహేను రోజులలో నేను పంపిస్తాను. నువ్వు ఏ సంగతీ నాకు ఉత్తరం వెంటనే వ్రాయ గోర్తాను. నీకు వీలుకాని పక్షంలో నేను మరేదయినా ఏర్పాటు చేస్తాను. ఇంతే సంగతులు.

కా. కృష్ణశర్మ.

నవంబరు 15 వ తేదీ 1951

ఈ రోజు పుట్టినదినం. అంటే ముప్పైఆరువెళ్ళి ముప్పైఏడవ సంవత్సరం వచ్చిందన్నమాట. ప్రతి సంవత్సరం మామూలుగా జరిగేదే. ఈ సంవత్సరం కొంచెం కొత్తపద్ధతిగా జరిగింది. నిన్న సాయంత్రం మాటలసందర్భాన ఆవిడతో రేపు నా పుట్టినదినం అనడంవల్ల వచ్చింది చికాకు. ఆఫీసుకి శెలవు పెడితేనేకాని ఒప్పుకోలేదు. భోజనంకూడా వాళ్ళింట్లోనే చెయ్యవలసి వచ్చింది. హోటలునుండి మూడు తీపిపదార్థాలు తెప్పించింది. తాను స్వయంగా సేమ్యాపాయసమూ పెరుగు గారెలూ చేసింది. వెనుక సుశీల ఉండిన రోజులు జ్ఞాపకంవచ్చి కళ్ళలో నీళ్లు తిరిగేయి.

ఇటీవల ఈ రెండుమూడు నెలలలోనూ ఆవిడ ఇంత ఉత్సాహంగా ఉండడానికి ఇదే ప్రథమం. రోజంతా అక్కడే గడిచిపోయింది. అసలు ఇదొక అలవాటయిపోయింది. ఉదయం ఒక గంటసేపూ, సాయంకాలం ఆఫీసునుండి రావడమే తిన్నగా అక్కడకు వెళ్ళడమూ, ఎనిమిది ఎనిమిదిన్నర వరకూ అక్కడే కూర్చోడం. మొదట్లో ఆమె ఆరోగ్యం గురించి, మందు మాకుల గురించి కనుక్కోడం అవసరమయితే కావచ్చునకాని ఇటీవల రోజూ ఉదయం సాయంత్రం వెళ్ళి అంతసేపు వెళ్ళి కూర్చోడానికి ఏమిటి అవసరం ఉంది. కేవలం రేడియో వినడమన్నది ఒక పెద్ద కారణం కాదు కదా? ఎంతమంది ఇతరుల ఇళ్ళల్లో లేదు రేడియో? కాక; అంతగా కావాలంటే ఒకటి కొనుక్కోకూడదా? లేకపోతే అవసరమయిన వదంతులకు ఆధారం కల్పించినట్టవుతుంది.

అందులోనూ ఆవిడ ఈ సాయంకాలం ఇచ్చిన వాచీ పుచ్చుకోక పోవలసింది. అది కొత్తదయినా బాధ లేకపోను. వెనుక ఆమె భర్త పెట్టుకొనేదట. అది ఇన్నాళ్ళు భద్రంగా పెట్టెలో ఉంచి కీ యిస్తూ వచ్చిందట- అటువంటి ప్రియమైన వస్తువు, అంత ఖరీదయినది ఎవడో నాబోటివాడికి

ఇవ్వడం ఆమెది తప్పే. కాని, ఇచ్చిందే తడవుగా పుచ్చుకోడం నాదీ పొర
పాటే — కాని, ఆమె యిస్తానంటే వద్దనేపాటి శక్తి లేకపోయింది. ఇక
అది మరి తిరిగి ఇస్తే బాగుండదు - ఆవిడ పుట్టిన దినమో లేక మరొక అవ
కాశమో చూసుకొని, ఏదయినా తగిన వస్తువు బహూకరించాలి. దీనికి ప్రతి
ఫలంగా చేసేమన్నట్టుండకూడదు. అలా అయితే ఆమె పుచ్చుకోకపోవడమే
కాక నవ్వుతుంది - ఆమె మాటలనుబట్టి చూస్తే మళ్ళీ నెల సిరిపురం వెళ్ళిపోయే
ఉద్దేశం ఉన్నట్టుంది. అవును మరి, డబ్బేమీ లేనప్పుడు ఇక్కడ అనవసరపు
ఖర్చులు పెట్టుకుని ఇబ్బంది పడేకంటె, అక్కడ స్వంత యిల్లుంది. దేనికయినా
కావలసినవాడు అన్నదమ్ముడున్నాడు!...ఆమె వెళ్ళిపోతే మళ్ళీ కొన్నాళ్ళు
ఒంటరిగా ఉన్నట్లుంటుంది - మనిషి సాంఘిక జంతువన్న మాటలో ఎంతో
సత్యం ఉంది. ఎంతగా ఒంటరితనానికి అలవాటుపడిన మనిషి అయినాసరే,
కొద్దిరోజులపాటు స్నేహం కలిసిందంటే మరి విడిచిపెట్టలేడు. ఇప్పుడు
వాళ్ళింటికి రోజూ వెళ్ళి యోగక్షేమాలు విచారించి రావడం ఆవిడకోసమో
నా కోసమో అనుమానం వచ్చేలాగుంది - కళల గురించిగాని, రాజకీయాల
గురించిగాని అంత చక్కగా మాట్లాడే ప్రజ్ఞ ఆడవాళ్ళలోనేకాము, మగవా
ళ్ళలో కూడా అతి అరుదుగా చూస్తాము.

ఆవిడ కుమార్తెని పెళ్ళి చేసుకోకపోవడంతో బుచ్చిబాబు నిజంగా
చాలా నష్టపోయాడు. అయితే ఆ నిశ్చయానికి బాధ్యత వాడిదే - నేను
చేసినదల్లా ఉన్న సాధక బాధకాలు తెలియజెయ్యడం మాత్రమే-ఒక్కొక్క
కుటుంబం బాగుపడడానికి ఒక మనిషి తన సౌఖ్యాన్ని కొంతవరకూ త్యాగం
చెయ్యాలి మరి—

ఆవిడ మనిషిలోని వైచిత్ర్యం ఇదే—తనకు ఒక కూతురు ఉండేదని.
ఆ అమ్మాయి పెళ్ళి ప్రయత్నమే తన ప్రధాన కర్తవ్యమని ఉండేదనీ - ఆసం
గతే మరిచిపోయినట్టుంటుంది. ఎల్లప్పుడూ ఇలా ఒంటరిగా తను ఉంటూ
ఉండడమే అలవాటయినట్లు మాట్లాడుతుంది. అయితే మళ్ళీ అక్కడ ఆ
పల్లెటూళ్లో ఆ యింట్లో వెళ్లి ఉండడం సంభవిస్తే, యింతగా మరచిపోవడం
సాధ్యంకాదేమో? మళ్ళీ కడుపునొప్పి కాకపోయినా, కూతురు వెళ్ళిపోయినా
కొత్తలో వచ్చిన స్తబ్దంవంటిది అంతకంటె ముమ్మరంగా రావచ్చును.

గత సంవత్సరం పుట్టిన దినం నాటికి ఈ మనుష్యులు ఉన్నారనే
తెలియదు, కృష్ణశర్మని గూర్చి కూడా వాడి ఉత్తరం వచ్చేవరకూ ఎటువంటి

ఆలోచనా లేదు. అటువంటిది సుమారు ఈ పది నెలల కాలంలోనూ వాళ్ల సమస్యలు కొన్ని నన్నూ పట్టుకున్నాయి. మావాడు బుచ్చిబాబు వాళ్ళతో ఆ జన్మాంతం తెగని సంబంధం కలియవలసిన పరిస్థితి ఏర్పడి మళ్ళీ ఏమీ లేకుండా ఎవరిదారి వారిదయింది - మరి కొద్దిరోజుల్లో ఆవిడ వాళ్ళవూరు వెళ్లిపోడంతో నాకూ వాళ్ళకూ మరి ఏమీ సంబందం ఉండదు. ఉత్తరం రాయవలసిన అవసరంమాత్రం ఏముంటుంది?

సిరిపురం, 10-2-52.

మిత్రుడు ధర్మారావుకి!

నన్ను పెళ్ళికి పిలవనందుకు "బావగారికి" అని సంబోధించలేదు నాకు నిజంగానే కోపంవచ్చింది. నీకు మొదటినుండీ ఉన్నదే యీ గుణం - చేసేపని చాపకింద నీరులా చేస్తూఉండడమూ బైటికి ఏమీ తెలియన్వకుండడమూను. కాని, నీనుండి ఇంతలో యీ గుణం మా చెల్లికికూడా ఎలా సంక్రమించిందో నా కర్థంకాకుండా ఉంది. ఎంత రిజిస్ట్రేషన్ మారేజి అయితే మాత్రం! మీ ముండడంవల్ల అభ్యంతరం లేదుకదా! నాకు ముందుగా రాయనివాడివి మీ అక్క చెల్లెలువాళ్ళకిమాత్రం రాసివుంటారేమిటికే - ఏమయినా మీ ఉభయులూ ఇక్కడికి వచ్చి పిలిస్తేనేగాని నేను మీ యింటికి రాను.

ఇక, మీ యిద్దరికీ వేర్వేరు ఉత్తరాలు రాయడం ఎందుకని ఇందులోనే రాస్తున్నాను, మా చెల్లెలు రాసింది, యింటిని ఎవరికయినా అమ్మినేసే సంగతి - మరి ఎలాగూ ఉండనప్పుడు తప్పకుండా అమ్మివేయవలసిందే. అయితే నాకు మా చెల్లెలు ఆ యిల్లు కట్టించిన నాటినుండీ అటువంటి యిల్లు కట్టించుకోవాలని ఉండేది. కాని, చెల్లెలునుచూసి అన్న యిల్లు కట్టించేడంటారని ఊరుకొన్నాను. ఆ యిల్లు నేనే తీసుకొంటాను, అలాగని మీకేం నష్టం చేస్తానని భయపడనక్కరలేదు. మామూలుగా అమ్మజూపి, ఎంత ధర వస్తుందో చూసి, ఆ ధరకే నేను తీసుకొంటాను. ఈ వ్యవహారం పరిష్కరించుకొనే నిమిత్తమయినా మీ రిక్కడికి రావాలి.

ఇంకా నిశ్చయంలేదుగాని, చిన్న సంగతి ఒకటి తెలిసింది. మన లీల అతగాణ్ణి సక్రమంగానే పెళ్ళి చేసుకొందనీ, అతగాడు మద్రాసులోని ఏదో సినీమాకంపెనీలో పనిచేస్తున్నాడనీ వార్త. అయితే ఇంకా నమ్మలేం.

ఏంసంగతీ రూఢిగా కనుక్కొని రాయవలసిందని, అక్కడ ఉన్న మన హయగ్రీవరావుకి రాసేను - వారం పదిరోజుల్లో జవాబు రావచ్చును. నామటుక నిజమే అయిఉంటుందనిపిస్తుంది. మీ మేనల్లుడికి అదృష్టం లేక పోయిందిగాని, మా లీల చాలా ప్రపంచజ్ఞానం కలిగినపిల్ల. దానిని చేసుకొన్నవా డెవడూ చాదస్తంగా తెలివితక్కువ పనులు చెయ్యడు.

మేనల్లుడికి సంసారబాధ్యత నెత్తిని పడుతుందని భయపడి నువ్వు స్వంతవిషయంలో ఇంతలా రెండవకంటివాడికి తెలియకుండా గురుతరమయిన బాధ్యతను స్వీకరించినందుకు అభినందించకుండా ఉండలేకపోతున్నాను.

మీ రెప్పుడు బయలుదేరివచ్చేదీ ముందుగా రాస్తావుకదూ మద్రాసు నుండి వచ్చిన భోగట్టా నిజమయితే వాళ్ళ దంపతులను రమ్మనడంగాని, లేక మీ దంపతులు అక్కడకు వెళ్ళడంగాని జరిగించవచ్చును.

ఇంతే సంగతులు,

కా. కృష్ణశర్మ.